ఆ ఊళ్లో అమ్మాయిలందర్నీ తన కామానికి బలిచేసిన అతనికి కూతురు చెప్పిన గుణపాఠం?

గంటి వెంకటరమణ కథ

# చల్లారిన పగ పడగెత్తింది

వెన్నెల విరిగి నేలంతా పరచుకున్నట్లు మెర్క్యురీ లైట్లు వెలుగుతునానయి. తెగిన తారకల్లా రంగు దీపాలు పోటీపడుతున్నాయి. ఆకాశం అంత పందిరీ, భూదేవంత అరుగూ వేసి డబ్బుని వెదజల్లుతూంటే అది 'డబ్బు' పరిమళంలాగే ఘుప్పుమంటోంది. ఎప్పుడెప్పుడు విందు భోజనాలైపోతాయా ఆ విస్తర్లనెప్పుడు ఎగరేసుకుపోదామా అన్నట్లు పదేళ్ళ ముష్టి కుర్రాళ్ళు ఎదురుచూస్తూ మేనమేషాలు లెక్కపెడుతున్నారు.

సన్నాయిలో 'నే'గుమోము' వినిపిస్తూంటే బాండ్‌లో 'పాన్ బనారస్‌వాలా!' అన్న పాట వినిపిస్తోంది. గాజుల చేయి గాజుల చేయి కలిస్తే ఘల్లుమన్నట్లు డబ్బూ డబ్బూ కలిసిన సందడి అక్కడే వినిపిస్తోంది. రాజకీయ నాయకులూ, సినిమా తారలూ, పురప్రముఖులూ ఆహ్వానింపబడ్డారు. పెళ్ళి కొడుకుని తీసుకువచ్చారు. సెంటుబుడ్లు పగిలిన వాసన ఘుభాళిస్తోంది. చిన్నా పెద్దా హడావుడిగా తిరుగుతున్నారు. లక్షలు చేతులు మారుతున్నాయి. టపాకాయల రసందడితో ఆవరణంతా దీపావళి ముందే వచ్చేసిన సంబరం పిల్లాపాపల, మొహంలో కనిపిస్తోంది.

భజంత్రీల మధ్య వరుడు జగన్మోహనరావు, వధువు మంజుమాల మెళ్లో మూడు ముళ్ళూ వేశారు. అంక్షంతల వర్షం కురిసింది. అప్పుడు మేడమీద గదిలో పెళ్ళికూతురు తండ్రి నాగభూషణరావు వియ్యంకుడు మాధవరావు చేతిలో ముదుపు



చెల్లించి నమస్కారం చేశాడు. ఇంతటితో ఈ ఘట్టం ముగిసింది. మంజుమాల డాక్టరే కనుక డాక్టర్ని చేసుకుంది. కూతురికి చదువూ, డబ్బూ, గుణం, ప్రతిష్ఠా అన్నీ

ఉన్న అల్లుణ్ణి తీసుకువచ్చారు నాగభూషణరావు. తల్లిలేని పిల్లని గుండెల్లో కట్టి మరీ పెంచాడు ఆయన. ఆ పిల్ల ఆడింది పాటగా పాడింది ఆటగా ముద్దు

చెల్లించాడు. మెడిసన్ పూర్తిచేశాక మంజుమాల తండ్రి చాటునుంచి బయటపడి లోకం తీరు గమనించడం నేర్చుకుంది.

వియ్యంకులిద్దరూ బాటిల్స్ ఓపెన్ చేసి 'ఛీర్స్' చెప్పుకున్నారు. మూడు పెగ్గులు పూర్తయ్యేసరికి శరీరంలో పటుత్వం తప్పినట్లు మీరునుంచి 'నువ్వు'కి దిగి క్రమంగా 'ఏమోయ్'లోకి వచ్చారు.

'సిమెంటు ఫ్యాక్టరీ పర్మిట్ సంగతేం చేశావు బావా', మాధవరావు అడిగాడు. గుటకవేసేది ఆల్కహాల్ అయినా అతనీ అయాచితంగా వస్తున్న అదృష్టాన్ని మరిచిపోకుండా జాగ్రత్తగా డీల్ చేస్తున్నాడు.

'అదెంతసేపు? నా కున్నది ఒక్క బిడ్డ, ఏం చేసినా 'పాప' కోసమే. ఎంతైనా సరే తెచ్చి తీరుతాను'.

'నాకు తెలుసు రాజు తలుచుకుంటే దెబ్బలకి కొదవలేదని ఊరికే అన్లేదు. అయినా నేను మాత్రం కట్టుకుపోతానా?' లౌక్యంగా తప్పించుకున్నాడాయన.

పీకల్దాకా తాగాక విశ్రాంతికోసం ఎవరి గదుల్లోకి వాళ్లు వెళ్లిపోయారు.

క్రింద వీళ్ళలో ప్రమేయం లేకుండా విందులూ, వినోదాలూ ముగిశాయి. బంధువులూ, స్నేహితులూ మెల్లగా వెళ్లిపోయారు. పెళ్లి కొడుకుని స్నేహితులు తొక్కుపోయారు. మంజుమాల తన గదిలోకి వచ్చేసింది. అంత పెద్ద ఇంట్లో ముసలివంటావిడ తప్ప ఆమెకి మరెవ రితోడూ లేదు. చాలాకాలం వరకూ హాస్టల్లోనే ఉండడం వల్ల ఇంటిపట్టునే ఉండే అవసరం ఇంతవరకూ ఆమెకి రాలేదు. ప్రొద్దున్నుంచీ బడలికా ఉండడంవ ల్ల హాయిగా నిద్రలోకి జారుకుంది.

తెల్లవారుజామున మూడుగంటల ప్రాంతంలో ఎవరో కొట్టినట్లు మెలకువ చ్చింది. చుట్టూ చూసింది. స్నేహితులలో భర్త వాళ్లకోసం కేటాయించిన గదిలో ఉన్నాడు. మెల్లగా తలుపు తెరుచుకుని బయటికి వచ్చింది. తండ్రి గదిలో శబ్దం వినిపిస్తోంది. సన్నగా మారిన ఆస్వరం ఏడుపుస్థాయిని మరీ తగ్గించినట్లు స్పష్టంగా తెలుస్తోంది. లైట్లన్నీ ఆర్పేసి ఉన్నాయి. ఎక్కడో దూరంగా జీరో వాల్టు బల్బ్ కళాహీనంగా వెలుగుతోంది. అంతపెద్దమేడకి ఆ లైటు దిష్టిబొమ్మలా, అపశృతికి మచ్చుతునకలా కనిపిస్తోంది.

సభ్యతకాదని తెలిసినా అణగద్రొక్కుకోలేని కుతూహలం ఆమెచేత అడుగు ముందుకు వేయించింది.

'మీకు దండం పెడతాను బాబుగారూ, నన్నొదిపిపెట్టేయండి'.

'వన్నొడిపి పెట్టేందుకేటే విన్నిక్కడికి రప్పిస్త! దిగజారిన ఆయన భాష కూడా ఓ మెట్టు క్రిందికి దిగింది.

'నేను మీ బిడ్డలాంటి దాన్నంది'

చెంప ఛెళ్ళుమన్న శబ్దం వెనుక ఆయన మాటలు దూసుకు వచ్చాయి. నా బిడ్డకీ, నీకు పోలికేటే దొం... నీ పోకిళ్ళు నాకు తెలియవేటె...!

'దొరా,' ఆ పిల్ల నిస్సహాయంగా ఏడుస్తుంటే మంజుమతికి శరీరం అంతా జుగుప్సతో నిండిపోయింది. డబ్బునవాళ్ల చేతి

క్రింద తొత్తుల్లా పడివుండాలనే ఈ నీతి లేని న్యాయం ఎక్కడ బయలుదేరిందో అర్థంకాక క్షణం నిశ్శబ్దంగా ఉండిపోయింది. ఆ నాలుగు గోడలమధ్యా జరగబోయే అఘాయిత్యం తలుచుకోగానే మరోనిమిషం 'ఆలస్యం చేయలేదు. అక్కడేఉన్న కంచం సెమ్మా క్రింద పడేసింది. ఆ నిశ్శబ్దంలో పెద్ద డైనమైటు పేలినట్లు శబ్దంకాగానే తలుపు పక్కగా నిలుచుండి పోయింది. తండ్రి గదిలో లైటు వెలగడం, ఆయన బయటికి రావడం ఒకేసారి జరిగాయి.

'ఏమైంది పాపా' ఖంగారుగా అడిగాడు ఆయన.

'మంచినీళ్ళ కోసం వస్తే చీకట్లో దీపం సెమ్మా చేయి తగిలి క్రిందపడిపోయింది డాడీ!

'చేతికేం దెబ్బ తగల్లేదు కదా' ఆయన తండ్రి ప్రాణం కటకట లాడిపోయింది.

'లేదండి. మీకే నిద్రకి డిస్టర్బెన్సయినట్లుంది'

'ఇంతకి మంచినీళ్ళు త్రాగావామ్మా'

'మామ్మ పడుకుంది. నాకు భయంగా ఉందండి!

'భయం దేనికమ్మా. నేనున్నాను రామ్మా' ఆయన ఆరాటపడతున్నాడు.

ఈ అవకాశాన్ని వదలదలుచుకోలేదు మంజూమాల. తండ్రిని వంట గదిలోకి తీసుకవెళ్ళింది. ఈ మధ్యలో పాలేరు కూతురు లక్ష్మి మెల్లగా జారుకోడానికి వీలు దొరికింది. మంజుకి ఆ శబ్దం వినిపించింది. ఈ హడావుడిలో ఆయన ఆ సంగతి గమనించలేదు. కూతుర్ని జాగ్రత్తగా గది దగ్గిర వదలి కూతురి గురించి తప్పమరేమీ ఆలోచించలేదు.

ఆ తరువాత మంజు ప్రశాంతంగా నిద్రపోయింది. ఆమె గమనించలేదు కానీ, కుర్చీలు, బెంచీలూ సర్దేసి పనివాళ్ళు ఆరోజు చాలాసేపు ఉండిపోవలసి వచ్చింది. ఆ సమయంలోనే లక్ష్మి అనుకోకుండా పులినోట్లో తల దూర్చాల్సి వచ్చింది.

* * *

హనీమూన్ ఏర్పాట్లు జరుగుతున్నాయి.

## మరో తాజ్‌మహల్



ప్రపంచంలోనే ఒక అత్యద్భుత కట్టడంగా తాజ్‌మహల్ పేరు తెచ్చుకుంది. అయితే మరికొంతకాలంలో అమెరికాలో మరో తాజ్‌మహల్ ప్రత్యక్షం కాబోతోంది. అమెరికాలోని ఫ్లోరిడాలో వందమిలియన్ డాలర్ల ఖర్చుతో ఆగ్రాలోని తాజ్‌మహల్‌ను పోలి వుండేలా యథాతదంగా మరో తాజ్‌మహల్‌ను డాక్టర్ డోనాల్డ్ పోర్టిని అనే పారిశ్రామికవేత్త నిర్మించబోతున్నాడు. అందులో ఒక ఫైవ్‌స్టార్ హోటల్, అంతర్జాతీయ మార్కెట్, మ్యూజియం ఉంటాయని ఆయన అంటున్నాడు. ఇలాటి ఆలోచన ఆయనకెందుకు వచ్చిందో మరి.

—జూపిటర్

మంజుమాల ఊళ్లోకివెళ్ళి ఓసారి చూసిరావాలనుకుంది. చాలా రోజుల తరువాత పొలం గట్టుమీదీ నడుస్తుంటే అంతవరకూ ఆప్యాయంగా పలకరించే పల్లె జనం తప్పుకుని తిరగడం గమనించింది. తనకుగా తాను పలకరించినా ఏ ఒక్కరూ సమాధానం ఇవ్వడం లేదు.

ఇంటి రాగానే ముసలావిణ్ణి ఆ విషయమే అడిగింది. ఆవిడ భయం భయంగా చూసింది. తండ్రి సిమెంట్ పర్మిట్ కురించి హైదరాబాద్ వెళ్ళాడు.

"చెప్పమ్మా. ఎందుకువీళ్ళంతా నన్ను చూసి ఝడుసుకుంటున్నట్లు తప్పుకు తిరుగుతున్నారు?"

ఆవిడకి చెప్పక తప్పింది కాదు "మీ నాన్న తక్కువ వాడేం కాదు తల్లీ. పెద్దదైన ఆడపిల్ల కంటికి కనిపిస్తే వదలిపెట్టడు. ఎప్పుడో ఓనాడు ఈ ఊరి వాళ్లే ఆయన్ని మట్టు పెట్టేస్తారు. ఆయన చేతిలో బలం ఉంది. డబ్బు ఉంది. ఊరంతా ఏకం అయితే ఆయనకింక దిక్కులేదు."

మంజుమాల నివ్వెరపోయింది. తనకి అతని ఆంతరంగిక జీవితం గురించి బొత్తిగా తెలియదు. ఇద్దరు బట్టల్లో ఆయన చేసే పనులు ఇంత దారుణంగా ఉంటాయని ఆమె ఎప్పుడూ ఆలోచించలేదు. శ్రీమంతుల గారాల బిడ్డగా హాయిగా గడిపేసింది. ఆమె చెప్పిన మాటలు విన్నాక క్షణం కూడా అక్కడ ఉండబుద్ధి కాలేదు. నెమ్మదిగా బయటికి వచ్చేసింది. రేపో, మాపో తననీ, భర్తనీ ఫారిన్ పంపే ప్రయత్నంలో ఉన్నాడాయన. పైసకి పైస చేరుస్తూ స్టేటస్ పెంచాలని చూస్తున్నాడు.

ఎలాగైనా ఒప్పించి భర్తతో ఇక్కడే ఉండి ఉడికిపోతున్న ప్రజల్ని తన ప్రేమతో తనవైపుకి తిప్పుకోవాలి. వాళ్లకి జరుగుతున్న అన్యాయాన్ని బాహాటంగా కాకపోయినా ఏదోవిధంగా సరిదిద్ది ప్రాయశ్చిత్తం చేసుకోవాలి. ఈ ఆలోచనలతోనే ఆమె తిరిగి పొలం గట్టువైపు నడక సాగించింది.

అప్పటికే సంధ్య చీకట్లు ముసురుకుంటున్నాయి. జగన్మోహనరావు ఆ సాయంత్రం పక్కవూరు వెళ్లి వచ్చే టైము అయింది. అడుగులో అడుగు వేస్తుంటేమనసంతా వ్యాకులంతో తల్లడిల్లిపోతోంది.

'అమ్మాయిగారీ వేళప్పుడిలా బయల్దేరా రేంటండి?' శివుడు పార భుజం మీద వేసుకుని ఎదురువస్తూ అడిగాడు.

వాడని చూడగానే అప్పటివరకూ వాళ్లపట్లఉన్న వాత్సల్యం పక్కకి తొలగిపోయింది. వాడూ, వాడి చేతిలో పార చూడగానే ఆమె గుండె ఝల్లుమంది. అన్యాయాన్ని ఎదుర్కోవేందుకు బయలుదేరిన పరశురాముడిలా, వీరభద్రుడిలా కనిపిస్తున్నాడు ఆమె కళ్ళకి.

వాడో వెర్రి నవ్వు నవ్వి "అదేటండమ్మాయి గారూ. అలా అయిపోతున్నారు. ఒంట్లో బాగోలేదా ఏటీ!" అన్నాడు.

వాడి నవ్వు ఎగతాళి చేస్తున్నట్లు, వాడు వేసే ప్రతి అడుగూ తనమీదికి ధ్వజం ఎత్తేట్లూ కనిపిస్తున్నాయి. ఎ.సి.రూమ్‌లో బంధించినట్లు భయంతో వ

శికిపోతోందామె. వాడిని నిలువెల్లా పరిశీలిస్తూ నోట మాట రానిదానిలా నిలబడిపోయింది.

వాడు చుట్టూ చూసి ఈసారి ప్రశాంతంగా నవ్వాడు. ఎప్పటినుంచో పల్లె ప్రజలిటువంటి అవకాశం కోసమే చూస్తున్నట్లు స్పష్టంగా తెలిసిపోయింది. వాడు మరింతో దూరంలో లేదు.


మంజుల ఆగిపోయి రెండు చేతులూ పైకెత్తి జోడించింది. 'శివా, మీ కోసం, మీ అందరికోసం హాస్పటల్ తెరవాలని చెప్పాలని ఊళ్లోకి వస్తున్నాన్రా. నువ్వలా నవ్వకు. భయం వేస్తోందిరా నాకు. మనిద్దరం పంత... గారి బళ్లో చదువుకున్నాం గుర్తుందా? మీరంతా నావాళ్లు... నన్ను నీ స్నేహితురాలిగా గుర్తుపట్టలేక పోతున్నావేమిట్రా?'

భళ్ళున కుండ పగిలినట్లు నవ్వాడు వాడు. 'ఈ మాటల కేంటిలెండి. ఉప్పుడుమీరు చెప్పేదేటో నాకేం తెల్టం లేదండి మీ అయ్య ఏంచేశాడో తెల్సాండి. ఈ ఊరి ఆడకూతుర్లని బతకనీల్లేదండి.

ఆయన గారు చేసిన ఎదవపన్లకి ఆయన్ని సంపేయాలనుకుంటున్నారండి ఊరోళ్లందరూ. నామటుకు నాకది నచ్చలేదండి. ముల్లును ముల్లుతో తీయడం నాయం ఏటంటారు?'

'నువ్వేం' అంటున్నావురా?'

'ఊర్లో ఆడపిల్లలంతా ఆడి 'పాప'లవ్వాలని ఆడి ఉద్దేశమండి. ఆడి ఒక్క పాప మాలాటి కుర్రాళ్ళకి పాపై ఎట్టా ఉంటాదో ఆడికి తెలిసిరావాలని పించిందండి. మీ పెళ్లప్పుడు అనుకున్నానండి. లక్ష్మిని నేను మనువాడాలను కుంటోంటే ఆడికెన్ని



గుండెలండి దాని సెయ్యట్టుకోడానికి?

'అయితే ... నువ్వు'

'మీకియన్నీ వివరంగా సెప్పే పనేవుందండి. డాక్టర్‌బాబుగారి కారు పొలిమేర్లో సెడిపోయిందండి. మీ అయ్యవస్తే మా ఓళ్ళందరూ ఓ సూపుసూత్తారండి. ఆయనగారి పాణాలకేం ముప్పులేదండి. నే నామీ ఉంటాను. పోతేనండి. ఆయన సెడిన కూతుర్ని ఇంట్లో ఉంచుకుంటాడో, చెర్లో పడేస్తాడో ఆడిష్టం. సెటిల్మెంట్... సెటిల్మెంటే...

'శివా!మీకు నేనేం అన్యాయం చేశానురా?నువ్వునా అన్నలాటి వాడివిరా. నీకు పుణ్యం ఉంటుంది. నన్నర్థం చేసుకోరా? మీకోసం నేను ఇక్కడే ఉండాలని నిర్ణయించుకున్నానురా? నాకిప్పుడే ఈ విషయం తెలిసింది. నేను బాధ్యురాల్నా చెప్పు. మంజుమాల బేలగా మారిపోయింది. ఆమె నవనాడులూ కృంగిపోయాయి. ఊరంతా ఏకం అయి పగపట్టి కాటువేసేందుకు సిద్ధంగా ఉంది. ఈ పరిస్థితిలో తనేం చేయాలో అంతుచిక్కడం లేదు. దారి కడ్డు నిలిచి అవమానంతో, ఆవేశంతో విచక్షణా జ్ఞానం నురిచిపోయి బుసలు కొడుతున్న నాగేంద్రుడిలా శివుడు మాటలతో 'విలయతాండవం' చేస్తున్నాడు.

'ఇయన్నీ మా కెరుకలేదండి. మీరంతా గొప్పోళ్ళు, సదూకున్నాళ్ళు, మా వోళ్ళు కూడా మీ అయ్య కాళ్ళమీద పడి బిడ్డల్లాంటోళ్ళం అని బతిమాలుకున్నారు. ఆడి కళ్ళు మూసుకుపోయి ఆళ్ళని సెరిసేశాడండి. ఆడికి మేమేం కావప్పుడు నేను మీకు అన్నలాటోడ్నెలా అవుతానండి.'

మంజుల నిలవలేనట్లు గట్టుమీద కూలి పడిపోయింది. శివుడామె వైపు క్షణం చూశాడు. పచ్చని కాళ్ళకి వెండి మెట్టెలు జిగేల్‌మని మెరుస్తున్నాయి. ఆమె మెళ్ళోంచి బయటపడ్డ మంగళసూత్రాలు అస్తమిస్తున్న సూర్యుడి కాంతితో విశ్లేషం చెంది వాడి కళ్ళవైపు మిరిమిట్లు గొల్పుతూ క్షణం రెప్పలు మూశాయి. నలభై ఎనిమిది గంటల క్రితం పచ్చని పందిట్లో ముత్యాలు తలంబ్రాలు పోసిన ఆమె చేతులు ఆ ధాటికే కెంపు వర్ణం చెందాయి. నల్లపూసలు ఆమె మూర్తీభవించిన ఐదవతనానికి ప్రతీకలా ఉన్నాయి. పసుపుకుంకుమలతో, భారీమేళాలతో పల్లకీలో కూర్చోబెట్టి ఓ పక్కబోయి అయి తను సాగనంపాలి ఆమెని అత్తారింటికి-ఆలక్ష్మి కొడుకు మీద పగతో కాటికి పంపేవాడే... చదువుకోని పల్లెటూరి అమాయకపు సంస్కారం వాడి ఎదమీద సాదపెట్టి మేల్కొలిపింది. రెండు క్షణాలు ఆమెని చూశాడు. సాక్షాత్తూ ఆవూరిని కాపాడే పళ్ళాలమ్మ తల్లిలా ఉంది. ఆమె వాడికి భయంతో క్షణం వొళ్ళు జలదరించినట్లయింది.

అంతే ఆమె పక్కనుంచే వాడు నిశ్శబ్దంగా 'వెళ్లొస్తా' అన్నైనా చెప్పకుండా వెళ్లిపోయాడు.

ఆ రెండు నిమిషాలూ కళ్ళు మూసుకున్న మంజుల ఏ విధమైన అలికిడీ వినబడక పోవడంతో కళ్లుతెరిచింది. దూరంగా వెళ్లిపోతున్న శివుడు

విశ్వరూపంతో ఆకాశం ఎత్తుకు ఎదిగిపోయి కదిలిపోతున్న భావన ఆమెని కదిపివేసింది. మరోక్షణం ఆలస్యం చేయకుండా ఇంటివైపు నడిచింది.

అరగంటలో జగన్మోహన్‌తోబాటు నాగభూషణం కూడా వచ్చాడు. దార్లో కారు ట్రబులిచ్చిన సంగతి చెప్పారు. శివుడు ఏవిధంగా సహాయం చేశాడో కూడా చెప్పారు. అన్నీ నిశ్శబ్దంగా వింది మంజుల. ఆమె మనసులో రకరకాల ఆలోచనలు. శివుడు తలుచుకుంటే కాలి క్రింద చెప్పుతో విషసర్పరుగుని నలిపేసినట్లు నలిపేసేవాడే. వాడెందుకు అలా చేయలేకపోయాడో ఆమెకి అర్థం అయింది. అంత పగా, ప్రతీకారం, వాడి మంచి మనసు ముందు ఓడిపోయాయి. 'జీవహింస' పనికిరాదని విషసర్పరుగుని పెంచుకుంటామా?' ఆమె మనసు పదేపదే వల్లెవేస్తోంది.

రెండు రోజుల్లో బెంగుళూరు, ఊటీ మొత్తం దక్షిణ భారతం అంతా చూసేందుకు తండ్రి ఏర్పాట్లుచేశాడు. ఆయనకీమధ్య రాత్రిళ్లు సరిగా నిద్రపట్టడం లేదు. రేపోమాపో కూతురూ, అల్లుడూ పై చదువులకి వెళ్ళిపోతే ఒంటరిగా భారతదేశంలో మిగిలిపోవాలి. ఆయన పాలు తీసుకుని పడుకుంటున్నాడు.

మంజుల నవ్వుతూ, నవ్విస్తూ ఇల్లంతా కలియదిరిగింది. దాదాపు తనకి తెలిసిన పదిమంది ఆడపిల్లల జీవితాల్ని పొట్టనపెట్టుకున్న తండ్రి పొట్టమరీ వికృతంగా కనిపిస్తోంది. ధనగర్వంతో కామంతో విర్రవీగుతున్న ఆయన తండ్రిలా కనిపించడం లేదు. శాపగ్రస్తుడైన ఏ రాక్షసుడో? అనిపిస్తున్నాడు. ఆమె భర్త వెంట గదిలోకి వెళ్ళింది.

* * *

బాగా తెల్లవారింది. ఆ ఇంట్లో పనివాళ్లు ఒక్కసారి ఘొల్లుమన్నారు. వాళ్లఏడుపులకి మంజులా, భర్తా లేచి బయటికి వచ్చారు. ముసలావిడ శోకాలు పెడుతోంది. తండ్రి గదిలోంచి పనివాళ్లు బయటికి రావడం మంజులా, ఆమె భర్తా చూసి అటువైపు వెళ్ళారు. ఆయన మంచం మీద శాశ్వతంగా నిద్రపోతున్నాడు. పక్కనే ఆయన రాత్రి తాగిన పాల గ్లాసుఉంది.

ఊరు ఊరంతా ఆయన్ని చూసేందుకు కదిలివచ్చింది. వాళ్ల మనసుల్లో ఏముందో గానీ నిర్మలమైన వాళ్ల అంతఃకరణ వాళ్ల కళ్లల్లో కనిపిస్తోంది.

జగన్మోహనరావు పరీక్ష చేసి చెప్పాడు. నిద్రమాత్రల 'డోసు' ఎక్కువైందని.

ఆయన్ని కాటికి పంపే ఏర్పాట్లు చకచకా జరిగిపోతున్నాయి. ప్రముఖులందరూ పది, పన్నెండు గంటలకి వచ్చేశారు. అందరి మధ్యా ఆయన పూలరథం స్మశానానికి చేరుకుంది.

మంటలు ఆకాశాన్నంటుకుంటూంటే నీళ్లురాని కళ్లు తుడుచుకుని తెలెత్తింది ఆమె. శివుడు ఆమెవైపు జాలిగా చూశాడు. ఆ చూపులో కదిలిన భావం మూడో కంటికి అర్థం కాకూడదన్నట్లు మబ్బుపట్టిన ఆకాశంలోంచి వర్షపు జల్లు పడుతోంది.